



హత్యకు సంబంధించి వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ మీనా. చిత్రంలో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్

నమ్మించి.. చంపేశారు!

- శ్రీనివాస్ హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు జీకే గ్రాండ్ అధినేత, మాజీ రౌడీషీటర్ కాసుబాబు
- పాతకక్షలు, సోషల్‌మీడియా ఆడియోతో ప్రతిష్ట దెబ్బతిందని హత్యకు పథకం
- మరో ఏడుగురు నిందితుల అరెస్టు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

7

దూసుకొచ్చిన మృత్యువు!

టైరు పేలి బీభత్సం సృష్టించిన పెళ్లికారు

కిర్లంపూడి మండలం సోమవరం వద్ద ఘటన

ముగ్గురు బలి.. ముగ్గురికి తీవ్రగాయాలు

7

గోడను ఢీకొట్టిన బుల్లెట్

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

7



అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, డీఆర్వో మాధవి

జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

- డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు
- తుఫాన్ నష్ట నివారణలో అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి భేష్
- ముంపు బెడద నివారణకు బ్యాంకు రుణాలతో పనులు చేపడతాం
- పంట నష్టపరిహారం హెక్టారుకు రూ.17 వేల నుంచి 25 వేలకు పెంపు
- తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీపై మంత్రి అచ్చెన్న ఆరా
- హాజరైన కార్మికమంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను అన్నిరంగాల్లోను అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని వ్యవసాయ సహకార ఉద్యాన డైరీ డెవలెప్మెంట్ మత్స్యశాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, పౌరసరఫరాలు, మార్కెటింగ్, విద్యుత్, రెవెన్యూశాఖలకు సంబంధించిన సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కోవడంలో సీఎం చంద్రబాబు దగ్గర నుంచి క్షేత్రస్థాయి జిల్లా యంత్రాంగం వరకు తీసుకున్న చర్యలు సఫలీకృతం కావడంతో నష్టాలను నివారించగలిగామన్నారు. అయినప్పటికీ కోనసీమ జిల్లాలో ఒక మహిళ చెట్టుపడి మరణించడం దురదృష్టకరమన్నారు. తుఫాన్ నష్టాల అంచనా ప్రక్రియ శుక్రవారంతో ముగిసిందని తెలిపారు. రైతులకు త్వరలో నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సంభవించిన ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టాలను ఎమ్మెల్యేలు, అధికారులు మంత్రికి వివరించారు. బాధితులకు ప్రభుత్వపరంగా అందించిన పునరావాస సహాయ చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతీ లబ్ధిదారునికి చేరాలని, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి అమలుతీరును అధికారులను ప్రశ్నించి తెలుసుకున్నారు. వ్యవసాయంపై ఆధారపడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ మహేష్‌కుమార్ మంత్రికి వివరించారు. జిల్లాలో ప్రధానసమస్యగా ఉన్న డెల్టా ఆధునికీకరణ, డ్రైనేజీల్లో పూడికతీత పనులకు రూ.12 కోట్లు ఉమ్మడి జిల్లాకు కేటాయించడం జరిగిందని, ఈ ప్రతిపాదన క్రోడీకరించి డెల్టా, డ్రైనేజీ పూడికతీత పనులకు బ్యాంకుల నుంచి రుణం తీసుకోనున్నట్టు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. తుఫాన్ బాధితులకు 25 కిలోల బియ్యం, ఐదు రకాల నిత్యావసర వస్తువులతో పాటు రూ.3వేల తాత్కాలిక ఆర్థిక సాయాన్ని అందించినట్టు చెప్పారు. అలాగే చేనేత, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. పంట పరిహారాలను హెక్టారుకు రూ.17వేల నుంచి రూ.25వేలకు పెంచి అందించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 99.5 శాతం ఇ-క్రాప్ నమోదు చేయడం జరిగిందన్నారు. రీసర్వే కారణంగా ఉత్పన్నమవుతున్న రెవెన్యూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు భారీ వర్షాలు, తుఫాన్‌ల వంటి విపత్తుల సమయంలో ముంపు తీవ్రత పెరిగిపోయి వ్యవసాయ భూములు నష్టానికి గురవుతున్న దృష్ట్యా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురం, మండపేట ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేసి మార్చి నెలలో లబ్ధిదారులకు అందించాలని కోరారు. గృహనిర్మాణాల కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నివేశనా స్థలంతోపాటు రుణం కూడా మంజూరుచేయాలని కోరారు. జిల్లాలో 18 శాఖలకు సంబంధించి నష్టం అంచనాలను సమర్పించడం జరిగిందని తెలిపారు. కొబ్బరిచెట్టుకు రూ.1500 పరిహారం చెల్లించాలని, బీమా ప్రీమియం ఉన్న రైతులకు బీమా పరిహారం కూడా అందించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో 3లక్షల 50వేల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. తుఫాన్ వల్ల రంగు మారిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి సేకరించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసే పథకాల అభివృద్ధి కార్యక్రమాల సమచారాన్ని జిల్లాస్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి వారి భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగేలా చూడాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా నియోజకవర్గం విజన్ డాక్యుమెంట్ కార్యాలయంగా ప్రకటించి వాటి ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరారు. ఆరోగ్య సేవల్లో భాగంగా నిరుపయోగంగా ఉన్న హెల్త్ సెంటర్లను పునరుద్ధరించి సిబ్బందిని నియమించాలని మంత్రి కోరారు. కార్మికశాఖ మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని ప్రశంసించారు. డీఆర్సీ సమావేశంలో డీఆర్వో కె.మాధవి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, వైసీపీ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మిడి ఇజ్రాయిల్‌తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు..





మద్దులమెరకలో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తాం : జిల్లా కలెక్టర్

కొత్తపేట,నవంబరు8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పష్టంచేశారు. శనివారం కొత్తపేట మండలం మద్దులమెరకలో తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి, అరటి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని మంగళవారం కేంద్ర బృందం నష్టపోయిన పంటల పరిశీలనకు రానున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అంచనాల నివేదికలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. మైక్రో లెవల్ సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులను గుర్తించడం జరిగిందన్నారు. అలాగే స్థానికంగా దెబ్బతిన్న పంటల ఛాయచిత్రాలను ఎగ్జిబిషన్ రూపంలో కేంద్ర బృందం వచ్చినప్పుడు చూపించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, ఏడీఏ వెంకటరామారావు, తహశీల్దారు వై.రాంబాబు, ఏవో ద్వారకదేవి, ఉద్యాన అధికారి కోటేశ్వరరావు, కూటమి నాయకులు యల్లమిల్లి జగన్మోహన్, చోడపనీడి భాస్కరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల కోసం దరఖాస్తులు

25వ తేదీలోపు స్వీకరణకు అవకాశం

మండపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనాలను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజకవర్గానికి పది చొప్పున మొత్తం 70 వాహనాలను అందించనున్నారు. లబ్ధిదారుడికి అందించే త్రిచక్రవాహనం విలువ రూ.1.30 లక్షలు ఉంటుంది. ఈనెల 25వ తేదీలోపు అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయకుడు శ్రీనివాస్ కోరారు. ఈ ఏడాది నవంబరు 25వ తేదీ నాటికి 18 ఏళ్ల నుంచి 45 సంవత్సరాలు వయస్సు కలిగినవారు మాత్రమే దీనికి అర్హులు. అలాగే 70 శాతం, అంతకంటే ఎక్కువ శారీరక వైకల్య లోపం ఉన్నవారికి ప్రాధాన్యం. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థల ద్వారా మెటారైజ్డ్ వాహనం తీసుకుని ఉండకూడదు. ఎటువంటి వాహనం దరఖాస్తుదారుల పేరిట ఉండకూడదు. అభ్యర్థి రెగ్యులర్ విద్యార్థి డిగ్రీ లేదా అపై కోర్సులు చదువుతూ ఉండొచ్చు. అలాగే స్వయం ఉపాధి, వ్యవసాయం, దాని అనుబంధం ఉన్న వారికీ ప్రాధాన్యం ఉంటుంది. అయితే వీటిలో కనీసం ఏడాది అనుభవం ఉన్న వారై అయిఉండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను చేసుకోవాలి. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం (సదరం) ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్ కులధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీ) తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మురమళ్ల బ్రిడ్జి కండిషన్ పరీక్షిస్తున్న దృశ్యం

పాత బ్రిడ్జిల సామర్థ్యంపై సర్వే

ఐ.పోలవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్ల కిందట గోదావరి పాయలపై నిర్మించిన పాత బ్రిడ్జిల సామర్థ్యంపై సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా టాటా కాంట్రాక్టు సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీ సన్‌రైజ్ ఇంజనీరింగ్ కంపెనీ సర్వే చేపట్టింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల రాఘవేంద్ర వారధి కండిషన్‌ను శనివారం పరిశీలించారు. అనంతరం లోడ్ టెస్ట్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 బ్రిడ్జిలకు సంబంధించి కండిషన్ సర్వే చేపట్టినట్టు ఇంజనీర్ ఆనంద్‌సింగ్ తెలిపారు. అందులో భాగంగానే మురమళ్ల బ్రిడ్జి సర్వే చేపట్టినట్టు తెలిపారు. అలాగే తాళ్లరేవు మండలం కోరంగి బ్రిడ్జి కండిషన్ సర్వే ఆదివారం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్లు సాయివర్ధన్, శ్రీనివాస్‌ప్రసాద్ తదితరులున్నారు.



జలదారులివే..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం-విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నరసాపురం, నరసాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకు జలరవాణా రూట్లను గుర్తించారు. ఈ మార్గాల్లో పలు పరిశ్రమలకు కార్గో రవాణాతోపాటు పర్యాటక బోట్లను నడిపేందుకు అనుమతులిస్తూ ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానించారు. కాకినాడ నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలంతో పాటు పలు ఇతర మార్గాల్లోను భారీ రివర్ క్రూయిజ్‌లను నడపవచ్చని ప్రతిపాదించారు. ఇటీవల ఎంపిక చేసిన జల రవాణా మార్గాల్లో వ్యాపారాలు చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి. బకింగ్‌హాం కాలువ అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తర్వాత వీటితో చర్చలు జరిపి సరకు, పర్యాటక రవాణాకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టనున్నారు.

జల రవాణాకు మార్గం సుగమం

- కాకినాడ టూ పుదుచ్చేరి
- బకింగ్‌హాం కెనాల్‌కు మంచిరోజులు
- పురాతన జలరవాణాకు పచ్చజెండా
- ఐడబ్ల్యూఏఐతో సర్కారు ఒప్పందం
- రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధి
- ఐదేళ్లపాటు ఎంవోయూ అమలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హాం కాలువకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. ఈ మార్గంలో గోదావరి,కృష్ణా నదుల మీదుగా సరుకు రవాణా, పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఈ కాలువకు పూర్వ వైభవం తెచ్చే దిశగా రంగం సిద్ధమవుతోంది. ఈమేరకు కాలువ అభివృద్ధికి ఇన్నేళ్లకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో ఎంవోయూ కుదిరింది. ఐదేళ్ల పాటు అమల్లో ఉండనున్న ఒప్పందం మేరకు ఈ రెండూ కలిసి బకింగ్‌హాం కెనాల్ అభివృద్ధి, జల రవాణా మార్గాల అన్వేషణ, కాలువల డ్రెడ్జింగ్, రివర్ క్రూయిజ్ పర్యాటకాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి. తొలుత రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధికి ఐడబ్ల్యూఏఐ శ్రీకారం చుట్టనుంది.

నాడు ఎంతో ప్రసిద్ధి

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హాం కాలువ బ్రిటిష్ కాలంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కాకినాడ నుంచి మొదలయ్యే ఈ కాలువ గోదావరి, కృష్ణా మీదుగా తమిళనాడులోని విల్లుపురం వరకు 796 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్ర పరిధిలో 257 కి.మీ. వరకు ఉంది. కాకినాడ నుంచి గోదావరి మీదుగా తమిళనాడు వరకు అప్పట్లో జల రవాణా కింద సరుకులు భారీగా ఎగుమతి, దిగుమతి అయ్యేవి. అయితే క్రమేపీ కాలువ పూర్తిగా పూడుకుపోవడంతో ప్రభుత్వాలు గాలికొదిలేశాయి.

ఒప్పందాలు ఇలా..

జల రవాణాకు డిమాండ్ పెరగడం, కారుచౌక రవాణామార్గం కావడంతో కాలువను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈమేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువను అభివృద్ధి చేసే ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) తోను చర్చలు జరిపారు.ఈ మేరకు వారం కిందట ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో కాలువను రూ.80 కోట్లతో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నౌకల రాకపోకలకు వీలుగా కాలువల్లో పూడిక తీయడం, ఓడలు రాకపోకలు సాగించేలా వెస్సల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు, నావిగేషన్ వ్యవస్థ తీర్చిదిద్దడం, కాలువల్లో రివర్ క్రూయిజ్‌లు నడిపేలా సహాయపడడం వంటివన్నీ మౌలిక సదుపాయాల రూపంలో తీర్చిదిద్దనుంది. సెకండ్ పార్టీ కింద రాష్ట్ర ప్రభుత్వం తరపున జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాత రివర్ క్రూయిజ్ నౌకలు బెర్తింగ్ అవడానికి కావాల్సిన భూముల కేటాయింపు, బకింగ్‌హాం కాలువలో డ్రెడ్జింగ్ తర్వాత తవ్వితీసిన భారీ బురద, మట్టిని నిల్వ చేసేందుకు తగిన స్థలాలు, సరుకు రవాణా, పర్యాటక నౌకల రాక పోకలు, వెస్సల్ ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఐదేళ్లపాటు ఇవన్నీ ఈ రెండు ఒప్పందం ప్రకారం చేయాలని ఎంవోయూలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఇన్నేళ్ల తర్వాత బకింగ్‌హాం కెనాల్ అభివృద్ధికి మార్గం సుగమం కానుంది.

ఎన్ని అవకాశాలో..

బకింగ్‌హాం కాలువ ద్వారా సరుకు రవాణాకు మళ్లీ ఊపిరిలూదాలని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడిపోయాయి. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు బకింగ్‌హాం కాలువ అభివృద్ధికి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చేలా ఒప్పించారు. ఒప్పందానికి ముందే ప్రభుత్వం తరఫున పది జల రవాణా మార్గాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసేలా ప్రైవేటు సంస్థలను టెండర్ల ద్వారా ఆహ్వానించింది.ఈ మార్గాల్లో డ్రెడ్జింగ్ అనంతరం రవాణా కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలు సాగించేలా నిబంధనలు రూపొందించారు.

ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

అమలాపురంరూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపోలో రోజువారీ వేతన ప్రాతిపదికన ఆన్ కాల్ డ్రైవర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇన్‌స్ట్రక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. సదరు అభ్యర్థులు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండడంతోపాటు రెండేళ్ల హెవీ లైసెన్సు సర్టిఫికెట్‌తోపాటు లేటెస్ట్ జెన్యూన్ సర్టిఫికెట్లను సమర్పించాలి. సేవాభావం కలిగిన నిరుద్యోగ డ్రైవర్లు ఈ పోస్టుల కోసం అమలాపురం ఆర్టీసీ డిపోలోని సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కె.రమేష్‌బాబు, సెల్ 94410 41270, 7382909829లను సంప్రదించాలని కోరారు.



రామచంద్రపురంలో మహిళకు రూ.లక్ష ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా : సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంబంధించి తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సుభాష్ ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజల మంత్రి సుభాష్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రతీ అర్జీని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా నియోజకవర్గాలతోపాటు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కూడా ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కాగా కనకలక్ష్మీ అనే మహిళ తన భర్త చెట్టు మీద నుంచి పడిపోయాడని, ఆపరేషన్ చేసినా మంచానికే పరిమితమయ్యాడని మంత్రి సుభాష్‌కు వివరించింది. ఈ సమస్యను విన్న మంత్రి తన వ్యక్తిగత నిధుల నుంచి రూ.లక్ష చెక్కును అందించారు. టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ఉపాధ్యక్షుడు చందమామ వాసు, కాజులూరు టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి పాల్గొన్నారు.

11న కేంద్ర బృందం రాక

అమలాపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం (ఐఎంసీటీ) ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనుంది. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమి బసు నేతృత్వంలో 8 మంది సభ్యులతో కూడిన ఈ బృందం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించనుంది. ఈ బృందం 10న ఉదయం విజయవాడ చేరుకుని తాడేపల్లిలోని ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో అధికారులతో ప్రాథమిక సమావేశం నిర్వహిస్తుంది. అనంతరం తుఫాన్ ప్రభావిత జిల్లాలో క్షేత్ర పర్యటనలు చేపడుతుంది. ఇవి రెండు బృందాలుగా విడివడుతుంది. రెండో బృందం 10న కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటిస్తుంది. ఇదే బృందం 11న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటిస్తుంది. ఆయా జిల్లాల్ల పంట నష్టాల్ని స్వయంగా పరిశీలించడంతోపాటు తుఫాన్ బాధితులతో నేరుగా మాట్లాడుతుంది. ఈ బృందం తుఫాన్ నష్టం, పునరావాస చర్యలు, ప్రభుత్వ యంత్రాంగం, స్పందన వంటి అంశాలను పరిశీలించి నివేదికను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నదని అధికారులు తెలిపారు. బృందం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

'వాడపల్లి'కి.. ఉచిత బస్సుకై..!




వాడపల్లి వెళ్లి వచ్చే భక్తులతో రద్దీగా ఉన్న రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్

- రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్‌కు భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు
- ఉదయం నుంచి బస్సు కోసం ప్రయత్నం
- రాత్రి వరకు రద్దీగానే ఆర్టీసీ కాంప్లెక్స్

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ నెలకొంది. పైగా, మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కూడా ఉండడంతో వారంతా బస్సులకోసం వేచిచూడాల్సి వచ్చింది. కార్తీకమాస పర్వదినాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులు వాడపల్లి వెళ్లేందుకు ఇక్కడకు తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఉదయంనుంచి రాత్రి వరకూ రద్దీ ఏర్పడింది.

వీడనున్న మిస్టరీ!

- రామచంద్రపురం బాలిక మృతి కేసులో చివరిదశకు దర్యాప్తు
- ప్రాథమిక ఆధారాల ప్రకారం అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు
- ఇప్పటికే పలువురిని ప్రశ్నించిన పోలీసు అధికారులు
- విచారణను స్వయంగా పర్యవేక్షిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా
- వరుసగా రెండురోజులు పోలీస్‌స్టేషన్‌కు రాక.. కేసు పురోగతిపై ఆరా
- నేడు కేసు వివరాలు వెల్లడించే అవకాశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాలిక మృతి మిస్టరీ వీడనుందా.. అంతుచిక్కని వ్యవహారంగా మారిన ఈ కేసు దర్యాప్తు ముగింపు దశకు చేరినట్లు సమాచారం. ఈ కేసు విచారణను ఎస్పీ రాహుల్‌మీనా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీని నిమిత్తం ఇప్పటికే ఆయన రెండుసార్లు రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చారు. కేసు పురోగతిపై స్వయంగా ఆయనే ఆరా తీస్తున్నారు. దర్యాప్తు చివరి దశకు రావడంతో ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఏం జరిగిందంటే..

ఈనెల 4న రామచంద్రపురంలో 5వతరగతి విద్యార్థిని సిర్రా రంజిత(10) అనే బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. బాలిక తల్లి సునీత స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. పట్టణంలోనే త్యాగరాజునగర్‌లోని అద్దెఇంట్లో నివసిస్తున్నారు. సునీత భర్త సిర్రా రాజు ముంబయిలో షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. వీరి పెద్దకుమార్తె నవోదయ పాఠశాలలో చదువుతోంది. చిన్నకుమార్తె రంజిత స్థానిక ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఈనెల 4న సునీత కాకినాడ వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల అనుమానాలు

బాలిక మృతిపై తల్లి సునీత, తండ్రి రాజు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన రోజున ఏరియాఆస్పత్రి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో వారు పలు అంశాలు ప్రస్తావించారు.ముఖ్యంగా ఉరివేసుకునే ఫ్యాన్ రంజితకు అందని స్థితిలో ఉండడం, సమీపంలో ఎత్తుకు ఎటువంటి పరికరాలూ వాడిన దాఖలాలు లేకపోవడం, ఫ్యానుకు ఉరివేసుకున్న చున్నీకి వేసిన ముడులు క్లిష్టంగా ఉండడం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. వీరి ఆరోపణల ఆధారంగా ఇంటి యాజమాని కుమారుడిని పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీల ఆధారంగా మరికొంత మందిని కూడా విచారించినట్లు చెప్తున్నారు. ఎలక్ట్రికల్ పనులు చేసే ఓ యువకుడిని కూడా విచారించినట్లు తెలుస్తోంది.

హత్యా. .ఆత్మహత్యా..

కాగా బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో అనుమానాస్పద మృతిగానే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు రంజిత మృతిపై ప్రాథమిక ఆధారాలతో ఒక అభిప్రాయా నికి వచ్చినట్లు సమాచారం. హత్య కేసుగానే దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. కీలక ఆధారాల సేకరణలో యంత్రాంగం ముమ్మరంగా కృషి చేస్తోంది.

కీలకంగా మారనున్న పోస్టుమార్టం

బాలిక మృతదేహానికి ఈనెల 5న పోస్టుమార్టం నిర్వహించారు. మృతికిగల కారణాలు సాంకేతికంగా తెలుసుకునేందుకుగాను ఫోరెన్సిక్ పరీక్షలకు శాంపిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో సాంకేతిక ఆధారాలు కీలకం కానున్నట్లు తెలుస్తోంది.

వరుసగా రెండురోజులు ఎస్పీ రాక

కాగా, ఈ కేసును జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు అధికారులను కేసు విచారణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక మృతి కావడంతో తాను స్వయంగా వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. శనివారం రాత్రి కూడా ఎస్పీ రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. డీఎస్పీ రఘువీర్ కూడా రామచంద్రపురం స్టేషన్‌లో ఉన్నారు. కేసు మిస్టరీని దాదాపు ఛేదించినట్లు తెలుస్తోంది. ఆదివారం కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉందని సమాచారం.

ఎనిమిదేళ్ల తర్వాత మహిళకు పెద్ద ఖర్మ

- చింతూరు మండలం కల్లేరులో కార్యక్రమం నిర్వహించిన ఐద్వా గ్రామ కమిటీ


జోగమ్మకు సంప్రదాయ పెద్ద ఖర్మను నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆ మహిళ కాలం చేసి ఎనిమిదేళ్లయింది. కొడుకులు పట్టించుకోలేదు. దీంతో ఐద్వా నేతృత్వంలో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిన పెద్ద ఖర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కల్లేరులో శనివారం చోటుచేసుకుంది. 15ఏళ్ల క్రితం సరిహద్దు రాష్ట్రమైన ఒడిస్సాలోని వినాయకపురం నుంచి పండుగ జోగమ్మ కల్లేరు వలస వచ్చింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. ఎనిమిదేళ్ల క్రితం జోగమ్మ మృతి చెందింది. గ్రామస్థులు ఆమెకు దహన సంస్కారాలు తమ సంప్రదాయ పద్ధతిలో చేసేశారు. పెద్ద ఖర్మ చేయడానికి ఆమె వారసత్వం తప్పని సరి. దీనిపై ఆమె కుమారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదు. తమ గ్రామంలో ఒక మహిళకు చివరకు పెద్ద ఖర్మ నిర్వహించకపోలేకపోవడాన్ని గ్రామస్థుల మనస్సు కలచివేసేది. కల్లేరు ఐద్వా గ్రామ కమిటీ పెద్ద ఖర్మ చేసేందుకు ముందుకు వచ్చింది. పెద్దల అనుమతితో కొంతసొమ్ము చందాగా ఇచ్చింది. తదుపరి గ్రామంలోని ప్రతిఇంటికి రూ.200 వంతున, 2కిలోల బియ్యం చందా రూపంలో జమ చేసింది. జోగమ్మ నివసించిన స్థలంలో చిన్న ఇల్లును కూడా ఏర్పాటు చేశారు. జోగమ్మ కుమారులకు సమాచారం ఇవ్వడంతో వారు చుట్టపుచూపుగా కార్యక్రమానికి వచ్చారు. ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు ముర్రం రంగమ్మ, చిన్నమ్మ, సోయం రమాదేవి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సామర్లకోటలో భీమేశ్వరుడికి ఆకాశదీప పూజలు

సామర్లకోట,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీకమాస మహాపర్వదినాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంవద్ద పండితులు ఆకాశదీప పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో ఆకాశదీప పూజలు, జ్యోతిర్లింగార్చన పూజలు చేస్తున్న దృశ్యం

బండెనక బండి కట్టి..!



బండెనక బండి కట్టి.. 16 బళ్లు కట్టి అన్నట్టుగా వరుసగా వెళ్తున్న ఈ ఎడ్ల బండ్లు పిఠాపురం జాతీయ రహదారిపై శనివారం కనిపించాయి. ధాన్యం తోలకాలకు ఒకదాని వెనుక ఒకటి ఇలా వెళ్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

ఫొటో: ఆంధ్రజ్యోతి-కాకినాడ స్టాఫ్‌గ్రాఫర్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- 14, 15వ తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు-2025
- పారిశ్రామికసంస్థలు, పారిశ్రామికవేత్తలు హాజరుకావాలి


ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన భాగస్వామ్య సదస్సు బేనర్

సర్పవరంజంక్షన్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 14-15వ తేదీల్లో రెండురోజులపాటు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ భాగస్వామ్య సదస్సు-2025 లో ఉమ్మడి జిల్లాల నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు తరలివెళ్లేలా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కృషిచేస్తున్నారు. పారిశ్రామిక సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలు, పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలకల్పన, స్థానిక పరిశ్రమల నిర్వాహకులతో కలసి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనాసంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో మెరుగైన మౌళిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నిర్మూలన కోసం విస్తృతంగా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. ఈమేరకు ఈనెల 10న ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ మండలం వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలో రూ.1.79కోట్ల ఐఏఎల్ఏ వాకలపూడి నిధులతో రోడ్లు, మౌళికసదుపాయాల కల్పన, మరమ్మతులు, వీధిదీపా లు, ఎస్‌వీ దీపాలు, ఫీడర్‌పిల్లర్ తదితర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేసేందుకు ఏపీఐఐసీ ఏర్పాట్లు చేస్తోంది. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కాలుష్య నిర్మూలన కోసం గ్రీన్‌బెల్ట్ పచ్చదనంకోసం విస్తృతంగా మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకున్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుకి తరలిరావాలి

ఏపీఐఐసీ కాకినాడజోన్‌పరిధిలో గల పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ యాజమా న్యాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్ బృందాలు, జోన్ పరిధిలో ఉన్న 11పారిశ్రామిక ప్రాంత ప్రాధికార సంస్థలు (ఐఏఎల్ఏ)లో సొసైటీ సభ్యులు తరలి రావాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కోరారు. ఈనెల 14-15వ తేదీల్లో విశాఖ ఏయూలో జరిగే సదస్సులో పాల్గొనే వారు http:\\partnershhipsummit.ap.gov.in ఆన్ లైన్ లింక్‌లో తమ పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగస్వామ్యసదస్సు ప్రధాన ఉద్దేశం పరిశ్రమల అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికవృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను పెంచేందుకు , భవిష్యత్తు వ్యూహాలను ఈ భాగస్వామ్య సదస్సు ద్వారా నిర్ణయించడం జరుగుతు ందన్నారు. ఉమ్మడిజిల్లా నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు.

వైసీపీ పాలనలో పీఏసీఎస్, డీసీసీబీ వ్యవస్థలు నిర్వీర్యం

- పీఏసీఎస్, డీసీసీబీలను బలోపేతం చేస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు


కుర్మాపురంలో శతాబ్ది భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


రాయవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పీఏసీఎస్‌లు, డీసీసీబీ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కుర్మాపురం సహకార సంఘం ఏర్పడి 105 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సహకార సంఘం శతాబ్ది భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి(కుర్మాపురం అబ్బు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో చాలా సహకార సంఘాలు వెనుకబడి, డీసీసీబీలు అప్పుల్లో ఉండటానికి కారణం ఐదు సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్‌చేసి నచ్చిన వారికి నచ్చినట్లు పరపతి సం ఘాలు, డీసీసీబీలను అప్పజెప్పి పూర్తిగా అవినీతిమయం చేసి వేల కో ట్ల రూపాయలను ఐదు సంవత్సరాలపాటు దోచుకుని వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చాలామంది ఎమ్మెల్యేలు తన దగ్గరకు వచ్చి గత ప్రభుత్వ పాలనలో తమ నియోజకవర్గాల్లో పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో దారుణాలు జరిగాయని ప్రజల సొమ్ము అప్పనంగా దోచేశారని చెప్పారన్నారు. దీనిపై అసెం బీల్లో ఒకరోజు అంతా చర్చ జరిగిందని, ప్రతి సంఘం మీద ఎంక్వయిరీ చేయడం ఒక ఎత్తు అయితే డీసీసీబీల పరపతి సంఘాల మీద ఒక శాసనసభా కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. ఈదేశంలో సొసైటీలు, డీసీసీబీలు కంప్యూటరైజ్ చేయాలని లోన్లు ఎంతమంది తీసు కున్నారు, ఎంత కడుతున్నారు తెలుసుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ సహకార సంఘాలు, డీసీసీబీలు కంప్యూటరైజ్ చేయాలని నిర్ణయించారన్నారు. అనేక ఒత్తిడిలు వచ్చినప్పటికీ ఆంధ్ర రాష్ట్రంలో పీఏసీఎస్‌లు, డీసీసీబీలు నూటికి నూరుశాతం తాము తమ ప్రభుత్వం కంప్యూటరైజ్ చేశామన్నారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌లను కూటమి ప్రభుత్వం బలోపేతం చేయడంతోపాటు పీఏసీఎలకు ధాన్యం కొనుగోలు, ఎరువులు, విత్తనాలు అమ్మకాలు సాగించడం ద్వారా బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. తుఫాను తరువాత పంటలన్నీ నేలవాలాయని, పంట చేతికి వచ్చే సమయంలో రైతుకు చాలా నష్టం జరిగిందని, రైతు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగాన్ని రైతుల దగ్గరకు పంపించి వాస్తవాలను నమోదు చేయాలని సూచించామన్నారు. ఆర్టికల్చర్, వరి పంటనష్టంపై ఈనెల 7న వచ్చిన రిపోర్టుపై ఒక అంచనాకు వచ్చామన్నారు. పంట నష్టం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుకు 17వేలు సరిపోదని ఇటీవల విజయవాడ వరదలు వచ్చిన సమంలో ఒక జీవో ఇచ్చి వరి పంట నష్టపోతే హెక్టార్‌కు 17వేల రూపాయల నుంచి 25వేలకు పెంచామని, అరటికి 35వేలకు పెంచి రైతుకు నష్టం లేకుండా పరిహారం అందజేస్తామన్నారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడిని మాజీ ఎమ్మెల్సీ చౌదరి, ఆయన సతీమణి సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వట్టికూటి సూర్యకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, డీసీఎంఎస్ ఛైర్మన్ చంద్రమౌళి సర్పంచ్ చౌటపల్లి చక్రవేణి, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, సహకారసంఘం అధ్యక్షురాలు సూర్యకుమారి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అసోంకు సామర్లకోట నుంచి బియ్యం ఎగుమతులు

- రైల్వేకు రూ.70 లక్షల ఆదాయం

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట రైల్వేగూడ్స్ యార్డు నుంచి 2,400 మెట్రిక్ టన్నుల పరిమాణం గల పచ్చిబియ్యం ఎగుమతులను శనివారం తెల్లవారుజాము వరకూ ప్రత్యేక గూడ్స్‌రైలు ద్వారా ఎగుమతులు చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రెండు ప్రముఖ రైస్‌మిల్లులకు చెందిన ఈ బియ్యం ఎగుమతులకోసం 42 వ్యాగన్లు వినియోగించారు. సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు నుంచి అసోంనకు ఎగుమతులు చేస్తున్న పచ్చిబియ్యం రవాణా ద్వారా సామర్లకోట రైల్వేస్టేషన్‌కు రవాణా చార్జీలుగా రూ.70 లక్షల ఆదాయం సమకూరడవేగాక 100 లారీలకు, 20ట్రాక్టర్లకు ఎగుమతులు, దిగుమతుల ద్వారా రూ.15లక్షలు, 100 మంది హమాలీ కూలీలకు రూ. 4.50లక్షల మేర ఉపాధి లభించింది. రానున్న 20 రోజులలో మరో 10వేల మెట్రిక్‌టన్నుల మేర పచ్చిబియ్యం అస్సోం రాష్ట్రానికి ఎగుమతులు సామర్లకోట నుంచే రవాణా చేసేందుకు రైల్వే ఉన్న తాధికారులతో అంగీకారం కుదిరింది.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.67.35లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరుమాడవీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.67.35 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలితిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 9వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.3,60,330 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో జనసందోహం

- శనివారం ఒక్కరోజు 7907 వ్రతాలు
- రూ.70 లక్షల ఆదాయం


సత్యదేవుడి దర్శనంకోసం బారులుతీరిన భక్తులు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధి శనివారం భక్త జనసందోహంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతా లు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులు అధికసమయం క్యూలైన్లలో అవస్థలు ఎదుర్కొన్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం పట్టింది. రద్దీదృష్ట్యా అంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేశారు. 2000 వ్రతమండపంలో భక్తులు నిరీక్షణ అధికమవ్వడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్రతమండపాల ఖాళీనిబట్టి టిక్కెట్లు జారీ చేయాలని అన్నారు. 1500 అదనపు వ్రతమండపాలు ఏర్పాటుచేసినా భక్తుల సెంటిమెంట్‌కు వ్యతిరేకత రావడంతో వాటిలో నిర్వహించడం మానేశారు. ఛైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్‌వద్ద నుంచి పర్యవేక్షించారు. ఒకదశలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న మెట్ల మార్గాన్ని మూసివేసి రద్దీ అనంతరం తెరిచారు. ఈవో సుబ్బారావు కమాండ్ కంట్రోల్‌రూం, వ్రతమండపపాలను పరిశీలించారు. శనివారం ఒక్కరోజు 7907వ్రతాలు, సుమారు రూ.70లక్షల ఆదాయం సమకూరింది.

వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి,అమ్మవార్లను ప్రదక్షిణ గావించారు.

రేపు కాకినాడ వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ (స్మార్ట్ బ్రెయిన్స్) కంపెనీలో ఉద్యోగాలకు ఈనెల 10న కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంవద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ కంపెనీలో నెట్‌వర్క్ ఇంజనీర్, డెస్క్‌టాప్ ఇంజనీర్, ఎల్1 స పోర్ట్, డేటా సెంటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు బీటెక్ (ఆల్‌స్ట్రీమ్స్), బీసీఏ, ఎంసీఏ 2019 నుంచి 2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎడ్యుకేషన్‌లో ఒక సంవత్సరం అంతరాయం ఉన్నా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆరు నెలల ట్రైనింగ్‌లో ఏడాది ప్రాతిపదికన రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు జీతం, ట్రైనింగ్ అనంతరం రూ 3.5 లక్షల నుంచి రూ 3.8 లక్షల జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376222లో సంప్రదించాలన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు!




ప్రమాదంలో పాడైన మోటారుసైకిళ్లు



ఓదార్చుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

- టైరు పేలి బీభత్సం సృష్టించిన పెళ్లికారు
- రెప్పపాటులో ముగ్గురు బలి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తొట్టిరిక్షా తోస్తున్న తాత, మనవడి మృతి
- బొప్పాయిలు విక్రయించే మరొకరు..
- సోమవరం బస్టాప్ వద్ద ఘటన

కిర్లంపూడి/ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు సామాన్యులు.. కాయకష్టం చేసుకుంటేనే వారి జీవితం ముందుకు వెళ్తుంది. వారిపైకి ఓ పెళ్లికారు మృత్యురూపంలో దూసుకొచ్చింది. అతివేగం, నిర్లక్ష్యం.. దానికి తోడు ఒక్కసారిగా టైరు పంక్చర్ కావడంతో పెళ్లి కారు బీభత్సం సృష్టించింది. రెప్పపాటులో ముగ్గురిని బలితీసుకుంది. మరో ముగ్గురిని తీవ్రంగా గాయపరిచింది. దీంతో ప్రశాంతంగా ఉన్న అక్కడి వాతావరణం రోదనలతో మిన్నంటింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం జాతీయ రహదారిపై ఉన్న రిక్వెస్ట్ బస్టాప్ వద్ద శనివారం ఉదయం భీతావహ పరిస్థితి నెలకొంది. అన్నవరం నుంచి జగ్గంపేట వైపు ఓ పెళ్లికారు ఐదుగురితో కలిసి వెళ్తోంది. అతివేగం, నిర్లక్ష్యంగా వస్తుండగా సోమవరం బస్టాప్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ముందు టైరు పంక్చర్ కావడంతో అక్కడే ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్టాప్ వద్ద కాలేజీకి వెళ్లేందుకు విద్యార్థులు, స్థానికులు వేచిఉన్నారు. కారు అదుపుతప్పి మోటారుసైకిళ్లు, తొట్టిరిక్షా, విద్యార్థులు, స్థానికులను ఢీకొట్టింది. మోటారుసైకిల్‌పై బొప్పాయిలు అమ్ముకునేందుకు వచ్చిన ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45), తొట్టిరిక్షా తోసుకుంటున్న తాతామనవళ్లు మోర్తా ఆనందరావు (65), మోర్తా కొండయ్య (30) మృతిచెందారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకకి చెందిన ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు చీపురుపల్లి ఫణిశ్రీ, కొండ్రాపు చైతన్య, సోమవరానికి చెందిన మరో వ్యక్తి బత్తిన భద్రం తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

శ్రామికులే మృత్యువాత

ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రి ఆవరమంతా మృతుల కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది. బొప్పాయి కాయల వ్యాపారి అయిన ఏలేశ్వరంలోని 11వ వార్డు పెద్ద వీధికి చెందిన కాకాడ రాజు మోపెడ్‌పై సోమవరం వెళ్లి బస్టాప్ వద్ద మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. కాయకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అతడు లేడనే వార్తను ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. అతడికి ఆరుగురు సంతానం కావడంతో కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబానికి జీవనాధారం అయిన మోర్తా ఆనందరావు మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూనే జీవనం సాగించే మోర్తా కొండయ్య కూడా మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అతడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ముగ్గురు చిన్నపిల్లలు కావడంతో తమకు దిక్కెవరని, తాము రోడ్డు మీద పడ్డామని వారు రోదిస్తున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్ఐ టి.రఘునాథరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును ఎక్స్‌కవేటర్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంటనే సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతులకుటుంబీకులతో మాట్లాడి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించేలా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. తీవ్రగాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఫోన్‌లో కాకినాడ జీజీహెచ్ వైద్యులకు సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. రెండు మృతదేహాలకు ప్రత్తిపాడు సీహెచ్‌సీలో, ఒక మృతదేహానికి జగ్గంపేట సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేశారు. ఆసుపత్రుల వద్ద మృతుల బంధువుల రోదనలు స్థానికుల కంట కన్నీరు పెట్టించింది. దీనిపై ఎస్ఐ రఘునాథరావు కేసు నమోదు చేయగా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద ఘటనను ఎమ్మెల్యే నెహ్రూ సీఎంకు వివరించగా వెంటనే మృతుల కుటుంబీకులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందించాలని సూచించడంతో ఆయన సీహెచ్‌సీలకు వెళ్లి అందజేశారు. బాధిత కుటుంబాలను వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్నాల కోట శ్రీను పరామర్శించారు.

ఇద్దరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న దుర్గచైతన్య

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు క్షతగాత్రులు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం సోమవరంలో బస్టాప్‌లో నిలబడి ఉండగా అదుపుతప్పిన కారు అక్కడ ఉన్నవారిపై నుంచి వెళ్లడంతో ఘటనాస్థలిలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు విద్యార్థినులు, ఒక పురుషుడు గాయపడ్డారు. వారిలో దుర్గచైతన్య, భద్రం పరిస్థితి విషమంగా ఉన్నట్టు అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.

ఓ శుభకార్యానికి హాజరై వస్తుండగా..

- బుల్లెట్‌తో గోడను ఢీకొట్టిన ముగ్గురు వ్యక్తులు
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



వరప్రసాద్ (పాతచిత్రం)

పి.గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువు వారిపైకి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ విషాద ఘటన పి.గన్నవరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... కపిలేశ్వరపురం మండలం పల్లపులంకకి చెందిన మోరంపూడి వర ప్రసాద్ (28), బురుగు నాగేంద్ర (28), మల్లిడి విజయ్(26) తమ బుల్లెట్ వాహనంపై పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై కె.ఏనుగుపల్లి ఏటిగట్టు రోడ్డున ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్న వరం శివారు పల్లేరువారిపేట సమీపంలోకి వచ్చేసరికి రహదారి చెంతనే ఉన్న ఒక ఇంటి గోడను బలంగా ఢీకొట్టారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వరప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 సాయంతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు వరప్రసాద్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. చికిత్స పొందుతున్న విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని మెరకవీధి గోదావరిమాత విగ్రహం వద్ద సీతారామ స్నానఘట్టం సమీపంలోని చర్చి పక్కన గోదావరి నదిలో మగ మృతదేహం బోర్లాపడి ఉందని స్థానికులు పోలీసులకు శనివారం సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం పూర్తిగా డీకంపోజ్ అయిపోయి ఉంది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్, 9440796622 నెంబర్‌కు సమాచారం అందజేయాలని సీఐ పి.విశ్వం తెలిపారు.

నమ్మించి.. చంపేశారు!

- శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు జీకే గ్రాండ్ అధినేత, మాజీ రౌడీషీటర్ కాసుబాబు
- పాతకక్షలు, సోషల్‌మీడియా ఆడియోతో ప్రతిష్ట దెబ్బతిందని హత్యకు పథకం
- మరో ఏడుగురు నిందితులు అరెస్టు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



విలేఖరులకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంచలనంగా మారిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు సహా 8 మందిని అరెస్టు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శనివారం జరిగిన విలేకరుల సమావేశం వెల్లడించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేధించి బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా పనిచేసిన అమలాపురం పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్న మీడియా సమావేశంలో ఎస్పీ కంచిపల్లి శ్రీను హత్య కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37)కు అమలాపురం పట్టణానికి చెందిన జీకే గ్రాండ్ అధినేత గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు) మధ్య ఆర్థికపరమైన లావాదేవీల తో వైషమ్యాలు తలెత్తాయి. కాసుబాబుపై గతం లో రౌడీషీట్ ఉంది. ఈ క్రమంలో కాసుబాబును కంచిపల్లి శ్రీనివాస్ దూషించినట్టు సోషల్ మీడియాలో ఆడియోలు వైరల్ అయ్యాయి. అప్పటికే అప్పులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కాసుబాబు ఈ ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో తన ప్రతిష్ట దెబ్బతిన్నట్టుగా భావించి ఉనికి చాటుకోవాలని, ప్రజల్లో భయాన్ని కలిగించాలనే ఉద్దేశంతో కంచిపల్లి శ్రీనవాస్‌పై అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ గత నెల 25న తన భార్యకు రాజమహేంద్రవరం వెళుతున్నానని ఫోన్‌లో చెప్పాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గత నెల 27న శ్రీనివాస్ కిడ్నాప్‌కు గురయ్యాడని, పలువురిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పట్టణ పోలీసులు కంచిపల్లి శ్రీను అదృశ్యానికి సంబంధించి కేసును నమోదుచేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. శ్రీనివాస్ ఆరోజున చివరిసారిగా అమలాపురం పట్టణం ఏఎంజీ కాలనీవీధికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతో తిరుగుతున్నట్టు కొందరు సాక్షులు గుర్తించారు. దీంతో పోలీసులు విచారణ జరపగా చిక్కుముడి వీడింది. ఆడియోలు వైరల్ అయిన నేపథ్యంలో కాసుబాబు, అడబాల శంకర్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని కుట్ర పన్నారు. ఈ పనిని సలాది రాంబాబుతోపాటు భాస్కర్ల దుర్గానాగప్రసాద్‌కు అప్పగించారు. 25వ తేదీ రాత్రి వీరు పలుచోట్ల మద్యంకొనుగోలు చేశారు. రాత్రి 11 గంటల సమయంలో కంచిపల్లి శ్రీనును కారులో తీసుకువెళ్లి అంబాజీపేట మండలం వక్కలంక గ్రామం దగ్గర మద్యం సేవించారు. ఆ తరువాత సలాది రాంబాబు, భాస్కర్ల దుర్గానాగప్రసాద్ కత్తితో శ్రీనివాస్‌పై దాడిచేసి హత్యచేశారు. మత్యదేహాన్ని కారు వెనుక సీటులోవేసి ఆ దృశ్యాలను వీడియో కాల్ ద్వారా ప్రధాన నిందితుడిగా పేర్కొనబడ్డ గంగుమళ్ల కాసుబాబుకు చూపించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని పి.గన్నవరం మండల పరిధిలోని వైనతేయ నదిలో గోదావరిలో పడేశారు. ఆ మృతదేహం గతనెల29న మధ్యాహ్నం 1 గంటకు పి.గన్నవరం మండల ఆర్.ఏనుగుపల్లిలో మృతదేహాన్ని వెలికితీసి తరువాత శ్రీనివాస్ శరీరంపై గాయాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు.

నిందితుల వివరాలు ఇలా..

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అమలాపురం పట్టణానికి చెందిన గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు)తో పాటు హత్య చేసిన, సహకరించిన ఈదరపల్లికి చెందిన అడబాల శంకర్‌బంగారు, పట్టణంలోని ఏఎంజీ కాలనీకి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, మార్కెట్‌వీధికి చెందిన భాస్కర్ల దుర్గానాగప్రసాద్, అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన కరాటం నరేష్, రాజోలు మండలం వేగివారిపాలెంకు చెందిన యర్రంశెట్టి లింగయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా దొమ్మగూడెంనాగారంకు చెందిన మోరం సత్యగంగామాణిక్యాలరావు అలియాస్ సతీష్, అదే ప్రాంతానికి చెందిన మోరం వీరవెంకటసత్యశ్రీనివాస్‌లను ఈ కేసులో నిందితులుగా అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, సుజుకి యాక్సిస్ స్కూటర్, హత్యకు వాడిన కత్తి ఒకటి, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పెంటపాటి అనిల్ అనే మరో వ్యక్తి దొరకాల్సి ఉందని తెలిపారు. ఈ కేసులో హత్యకు గురైన శ్రీనివాస్‌ను కిరాతకంగా చంపారని వస్తున్న వార్తలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఎస్పీ బదులిచ్చారు. హత్యకు గురైన శ్రీనివాస్ నాలుక కోయలేదు. కళ్లు పీకలేదు. శిరోముండనం చేయలేదని స్పష్టంచేశారు. నాలుగు రోజుల పాటు మృతదేహం నీటిలో ఉండడం వల్ల ఒంటిపై ఉన్న వెంట్రుకలు ఊడిపోయాయని తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించడంలో కీలకంగాపనిచేసిన పట్టణ సీఐ వీరబాబు, ఇతర సిబ్బందిని ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి

సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల కోసం తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 12, 13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వివిధ వేదికల్లో జరుగుతాయని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ నెల 12న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అదే రోజు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, ఫుట్‌బాల్, యోగా, ఫ్యాట్ టు ఫిట్ జిమ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. దానవాయిపేట ప్రాంగణంలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు.13న హుకుంపేటలోని బొప్పన అకాడమీలో బ్యాడ్మింటన్, చరణ్ కార్తీక్ టీటీ అకాడమీ (ఏవీ అప్పారావు రోడ్డు)లో టేబుల్ టెన్నిస్, ఎస్‌కేవీటీ కళాశాలలో స్విమ్మింగ్, హాకీ, లాన్ టెన్నిస్, రెజ్లింగ్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్ ప్లే విభాగాల్లో కూడా ఎంపికలు జరుగుతాయని పురుషులు, మహిళలకు (ఓపెన్ కేటగిరీ- నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులు) పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో జరుగుతాయని, క్రీడాపోటీల్లో పాల్గొనదలచినవారికి ఎలాంటి టీఏ, డీఏ ఇవ్వబడదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 90329 34038లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మరణించింది. కొత్తపల్లి మండలం కాశీవారిపాకలకు చెందిన వాసంశెట్టి చంద్రమ్మ(72) తన మనవడితో కలిసి శనివారం పట్టణంలోని ఓ ఆసుపత్రికి వచ్చింది. చికిత్స అనంతరం బైక్‌పై ఇంటికి వెళుతుండగా జారిపడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించగా మరణించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..

చోరీల బాట

- ఐదుగురు వాహన దొంగలు అరెస్ట్
- రూ. 60 లక్షల విలువైన ఆటోలు, మోటారుసైకిళ్లు స్వాధీనం
- కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారు ఎనమండుగురు స్నేహితులు. ఎవరికి వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటోలు నడుపుతూ వారి రెక్కల కష్టంతో జీవనం సాగిస్తుంటారు. అయితే వీరికి పాత నేరస్థుడైన ఆటో డ్రైవర్ స్నేహితుడు కావడంతో అతను వారందరిలో కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనను నూరి పోసాడు. అప్పటి నుంచి వారందరు కలిసి కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, అనకాపల్లి, పశ్చిమగోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా నేరాలు చేస్తూ చివరికి కాకినాడ పోలీసులకు చిక్కారు.వారి నుంచి రూ.48 లక్షల విలువ చేసే 18 ఆటోలు, రూ.12 లక్షల విలువ చేసే 22 మోటారుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ నిందితుల వివరాలను వెల్లడించారు. శుక్రవారం రాత్రి పిఠాపురం మండలం విరవాడ గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు 8 మంది అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని ఆపే క్రమంలో ముగ్గురు వ్యక్తులు తప్పించుకోగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడు, పాత నేరస్థుడైన కాకినాడ రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్ కాలనీకి చెందిన పెమ్మాడి ఆశీర్వాదం, శివకృష్ణ కాలనీకి చెందిన పెందుర్తి లోవరాజు, కాకినాడ గోలీలపేటకు చెందిన కొల్లి దుర్గాప్రసాద్ అలియాస్ కిమ్స్, కరప మండలం బావారం గ్రామానికి చెందిన కాల కృష్ణఅర్జున్, కాకినాడ జగన్నాథపురం, ముత్తానగర్‌కు చెందిన కనుమూరి గణేష్‌లుగా వారిని గుర్తించారు. పరారీ ఉన్న వారిలో కాకినాడ ఏటిమొగకు చెందిన పెమ్మాడి వీరబాబు, స్థానిక జగన్నాథపురానికి చెందిన తోట శివ, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పితాని దుర్గ ఉన్నారని ఎస్పీ మాధవ్ తెలిపారు. వీరు ఇళ్ల వద్ద పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారన్నారు. ముఖ్యంగా హ్యాండిల్ లాక్ వేయని ఆటోలను తాడు సహాయంతో ఇంజన్ వెనుకభాగం నుంచి స్టార్ట్ చేసి దొంగిలించేవారు. మోటారుసైకిళ్లను మారు తాళాలతో తెరిచి తస్కరించే వారు. కాకినాడ జిల్లాలో 5 ఆటోలు, 11 మోటారుసైకిళ్లు, కోనసీమ జిల్లాలో 2 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఆటో, రెండు మోటారుసైకిళ్లు, అనకాపల్లి జిల్లాలో 9 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, ఏలూరు జిల్లాలో రెండు మోటారుసైకిళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక ఆటో, ఒక మోటారుసైకిల్ వెరసి 18 ఆటోలు, 22 మోటారుసైకిళ్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఈ కేసులు ఛేధించడంలో కృషి చేసిన క్రైం ఎస్ఐ బి.వినయప్రతాప్, టౌన్ ఎస్ఐ వి.మణికుమార్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీ గొప్పు చిన్న తదితర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, పిఠాపురం టౌన్ సీఐ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటోలు, మోటారుసైకిళ్లు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పోటాపోటీగా జూడో చాంపియన్‌షిప్



జూడో విజేతలకు మెడల్స్ అందించిన కైకలూరు సీఐ రవికుమార్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికలకు పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో రెండో రోజైన శనివారం కొనసాగాయి.

విజేతలు వీరే..

బాలికలు.. 36 కిలోల విభాగంలో.. నందిని(అనంతపురం), చాందిని(విశాఖ), ఐశ్వర్య(తూర్పు), అఖిలాండేశ్వరి విజేతలుగా నిలిచారు. 40 కిలోల విభాగంలో.. యస్వంత(అనంతపురం), గీతిక(చిత్తూరు), జ్యోతి(తూర్పుగోదావరి), జ్ఞానశృతి(కర్నూలు), 44 కిలోల విభాగంలో జాహ్నవి(అనంతపురం), శైలజ(చిత్తూరు), అరుణకాంతం(తూర్పు), స్నేహలత(కృష్ణ) విజేతలుగా నిలిచారు. 70 కిలోల విభాగంలో అమూల్య(గుంటూరు), శృతికీర్తన(కర్నూలు), మధులత(చిత్తూరు), నందిని(అనంతపురం), 90 కిలోల విభాగంలో అన్నపూర్ణ(చిత్తూరు), పూజ(అనంతపురం), దీవెన(తూర్పు), జాహ్నవి(విశాఖ) విజేతలుగా నిలిచారు.

బాలురు.. 45 కిలోల విభాగంలోయశ్వంత్(అనంతపురం), హిమతే(కర్నూలు), స్వర్జన్(తూర్పు), చరణ్(నెల్లూరు), 40 కిలోల విభాగంలో కార్తిక(అనంతపురం), పాల్(కర్నూల్), లిఖిత్‌కుమార్(కృష్ణ), ప్రసాద్(గుంటూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథులుగా హాజరైన కైకలూరు సీఐ రవికుమార్, ఎస్ఐ రాంబాబు చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

ముగిసిన స్క్వాష్ చాంపియన్‌షిప్

కాకినాడలో జరుగుతున్న అంతర్‌జిల్లాల ఏసీఎఫ్ స్క్వాష్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14 బాలురు విభాగంలో ప్రభుకిరణ్(తూర్పు), రమణ(తూర్పు), కార్తికేయ(తూర్పు), హరణ్య(తూర్పు), శశాంత్‌రెడ్డి(చిత్తూరు), వివేకానంద(గుంటూరు), ప్రేమ్‌సాయి(చిత్తూరు), అండర్-17 విభాగంలో తహప్రజ్(తూర్పు), సూరజ్(తూర్పు), అండర్-19 విభాగంలో అఖిల్(తూర్పు), సౌర్య(తూర్పు), బాలికల అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన బ్లెస్సీ, మహాలక్ష్మి, మేఘన, కీర్తన, అండర్-17 విభాగంలో అబిజ్ఞ, ఐశ్వర్య, రూపశ్రీ, తేజశ్విని, వేణు అండర్-19 విభాగంలో రూపశ్రీ, వెన్నెల, శ్రేయసుహాషిత, దేవి తదితరులు విజేతలుగా నిలిచారు. డీఎస్ఈవో సతీష్‌కుమార్, ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, బి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అబ్జర్వర్‌గా ఎస్కే బాబు వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏసీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, కె.శ్రీనివాసరావు, జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి మాచరరావు, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు బంగారాజు, లంకా జార్జి, వి.రవిరాజు పరశురాం, మంగయమ్మ, నాగమణి, దీప్తి, ఎస్తేర్, సూరిబాబు, మూర్తి పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో గంజాయి విక్రయాలు

- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు
- రాజోలు సీఐ నరేష్‌కుమార్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయిని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో గంజాయి నిందితుల రీవిజిట్ ప్రోగ్రాంలో భాగంగా పాత నేరస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్న క్రమంలో ఈ నెల 7న గంజాయి విక్రయంపై సమాచారం అందింది. మండల కేంద్రం రాజోలులోని ఒక ఇంట్లో మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన బి.విశాల్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. గూడపల్లికి చెందిన విశాల్, పడమటిపాలెం గ్రామానికి చెందిన డి.లక్ష్మీనాగనరసింహారావు, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఎం.సూర్యకిరణ్, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం దొడ్డనపూడికి చెందిన ఎస్.లక్ష్మీమురళీధర్, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన సీహెచ్ రవితేజ, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలేనికి చెందిన టి.జాన్‌సుభాకర్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.నిందితులను విచారించగా విశాల్ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అక్కౌంట్ క్రియేట్ చేసి అందులో కొందరు యువకుల ను ఫ్రెండ్స్‌గా చేర్చుకుని తనకు పరిచయం ఉన్న గూడపల్లి పంచాయతీ పల్లిపాలేనికి చెందిన ఎం.నాగేంద్ర వర్మ వద్ద నుంచి గంజాయి కొని తెచ్చి గ్రూపులో ఉన్న వారందరికీ అమ్ముతూ ఆ డబ్బును చెడు వ్యసనాలకు బానిసై విలాసాలకు ఉపయోగించుకుంటున్నాడు. గంజాయి అక్రమ రవాణాను నివారించడంలో భాగంగా ఆపరేషన్ సేవ్ క్యాంపస్ అని స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేసి డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. గంజాయికి సంబంధించి హాట్‌స్పాట్ ఏరియాలను కూడా గుర్తించామని తెలిపారు. నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్ లిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు తెలియజేయాలని కోరారు. కాగా నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పాపికొండలకు 500 మంది పర్యాటకులు

వీఆర్‌పురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాపికొండలు, పేరంటాలపల్లికి శనివారం 500 మంది పర్యాటకులు రావడంతో 9 బోట్లల్లో పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. ఇటీవల మొంథా తుఫాన్ అనంతరం ఈ నెల 2వ తేదీ నుంచి పర్యాటకం ప్రారంభించారు. శనివారం సెలవు దినం కావడంతో పోచవరం ఫెర్రి పాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ కాస్తా ఎక్కువగానే ఉంది. ముందుగా పర్యాటక బోట్లల్లో పేరంటాలపల్లి చేరుకొని అక్కడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ ప్రాంత కొండరెడ్లు వెదురుతో తయారు చేసిన పలు రకాల వస్తువులు, అందమైన అల్లికలను కొలుగోలు చేశారు. తర్వాత విహారయాత్ర బోట్లపై పాపికొండలు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదించి తిరుగు ప్రయాణం సాగించారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన మంతెన రవివర్మ-ఉషాదేవి దంపతులు కుటుంబ సమేతంగా శనివారంఅయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారి దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,008 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదఆశీర్వచనం అందజేశారు.

మోరి శివాలయం పునర్నిర్మాణానికి రూ.25వేలు విరాళం

అంతర్వేది, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీపార్వతీ సీతారామలింగేశ్వరస్వామి ఆలయం పునఃనిర్మాణానికి చింతా విఘ్నేశ్వరరావు-నాగమణిల కుమారుడు శ్యామ్‌గిరీష్, కుమార్తె నందిని శనివారం రూ.25,118 విరాళంగా అందించినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయాల్లో కార్తీక ప్రత్యేక పూజలు



ముమ్మిడివరం: వేంకటేశ్వరస్వామి, కాట్రేనికోన: వేణుగోపాలస్వామి, పి.గన్నవరం: లక్ష తులసి పూజ

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు స్వామి-అమ్మవార్లను దర్శించుకున్నారు. భారీఅన్నసమారాధన జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన అరుణాచలేశ్వర ఆలయంలో భక్తులు గిరి ప్రదక్షిణచేసి స్వామిని దర్శించుకున్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో క్షేత్రపాలకుడు శ్రీరుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాలస్వామికి కార్తీక మాసం మూడో శనివారం సందర్భంగా ఆలయ అర్చకుడు సుదర్శనం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో వృద్ధగౌతమిలో స్నానాలాచరించి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. శ్రీపార్వతీ సమేత కుండలేశ్వరాస్వామిని పూజించారు. ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వరుడు, కనకదుర్గ, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులకు భోజనవసతి కల్పించారు. ఎస్‌ఐఅవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

లక్ష బిల్వార్చన

మలికిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుడిమెళ్లంక శ్రీఉమాలక్ష్మణేశ్వరస్వామివారి ఆలయంలో మంగళంపల్లి సాయిరామ్ హనుమాన్ వారి ఆధ్వర్యంలో, రుత్విక్‌ల సహాయ సహకారంతో లక్షబిల్వార్చన, శాంతికల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష తులసి పూజ

పి.గన్నవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):రాజులపాలెంలో శ్రీపట్టాభి సీతారామస్వామి ఆలయంలో గ్రామస్తులు ఆధ్వర్యంలో శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెదపూడి రమణాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు స్వామివార్ని దర్శించుకున్నారు.

పద్మరాజును కలిసిన అమూల్య

అంతర్వేది, నవంబరు8(ఆంధ్రజ్యోతి):టీడీపీ సీనియర్ నాయకుడు రుద్రరాజు పద్మరాజును శనివారం ఆయన స్వగృహంలో టీడీపీ రాజోలు ఇన్‌చార్జి అమూల్య మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మరాజును ఆమె సత్కరించారు. రోడ్డు డెవలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, బీసీ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, దెందుకూరి శ్రీహరిరాజు, పులగం రమేష్ పాల్గొన్నారు.

అప్పనపల్లి బాలబాలాజీకి ప్రత్యేక పూజలు



మామిడికుదురు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి కార్తీకమాసం శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. వేకువజామునే అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.4,73,413 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 7,800మంది దర్శించుకుని 5,500మంది నిత్యాన్నదాన పథకంలో భోజనాలు చేశారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం దేవస్థానంలో ఇందుపల్లి గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు..

నిత్యాన్నదానానికి నగరం గ్రామానికి చెందిన దొమ్మేటి నాగేశ్వరరావు-గంగ దంపతులు రూ.10,116 అందించారు. భీమవరానికి చెందిన మంతెన వెంకటేశ్వరవర్మ-అశ్విని దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

యానాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ చమురు సంస్థ తక్షణమే మా సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని నిరాహార దీక్ష చేస్తున్న ఆందోళనకారులు హెచ్చరించారు. యానాం శివార దరియాలతిప్ప ఐలాండ్‌నెంబరు-3 సమీపంలో ఆగస్టు 22వ తేదీ అర్ధరాత్రి ఓఎన్జీసీ గ్యాస్‌పైపు లైను లీక్ అవ్వడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గోదావరిలోని జలసంపద పూర్తిగా నశించికపోవడం తదితర అంశాలపై పరిహారం కోరుతూ ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారంలో 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న వారికి కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు మద్దతు తెలిపారు. ఈఆందోళనలో మున్సిల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు తిరుకోటి నాగేశ్వరరావు, మెల్లం చిన్నా, మోకా బుజ్జి, గెడ్డం వెంకట్రావు, అప్పారావు, తిరుకోటి ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా రోటరీ యువజనోత్సవాలు



ఫ్యాన్సీ డ్రస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు-2025 పోటీలు ఉల్లాంగా జరుగుతున్నాయి. యూత్ ఫెస్ట్ పేరిట 12వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వరదా మలేశ్వరరావు (మల్లిబాబు), క్లబ్ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్, కార్యదర్శి ఆకొండి పవన్‌కుమార్, కోశాధికారి కూచిమంచి శశిధర్‌శ్రీరామ్, యువజన మాసోత్సవాల చైర్మన్ ఎస్ఎస్ రామసతీష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1నుంచి ప్రారంభమైన రోటరీ యువజనోత్సవాలు ఈనెల9వరకు జరుగుతున్నాయి. అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని రోటరీ కల్యాణ మండపం వేదికగా పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు ఈ నెల23న బహుమతులు అందజేస్తామన్నారు. ఇప్పటివరకు జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో భక్తి సంకీర్తనలు, చిత్రలేఖనం, చదరంగం, యోగాసనాలు, కబడ్డీ, పరుగుపందెంతో పాటు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ఫ్యాన్సీ డ్రస్ కాంపిటేషన్‌లను పూర్తి చేశామన్నారు. ఇంకా పలు పోటీలను మూడు రోజుల్లో పూర్తి చేసే విజేతలకు ప్రత్యేక వేదికపై బహుమతులు అందజేస్తామన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి ఆకొండి పవన్‌తెలిపారు.

బిహార్‌లో లోకేశ్‌తో ఎంపీ హరీష్



అమలాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీహార్‌లోని పారిశ్రామివేత్తలు, బీహార్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో పాల్గొనేందుకు ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో పాటు అమలాపురం పార్లమెంటు సభ్యుడు, పార్టీ విప్ గంటి హరీష్‌బాలయోగి శనివారం పాట్నా చేరుకున్నారు. మంత్రి లోకేశ్‌తో పాటు ఈసమావేశంలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్లకు రూ.26వేల వేతనం చెల్లించాలి



మట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్

అమలాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు జీతం రూ.26వేలకు పెంచడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫీల్డుఅసిస్టెంట్ల ఐక్యవేదిక సమావేశం డిమాండ్ చేసింది. శనివారం అమలాపురంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశానికి జిల్లా ఫీల్డు అసిస్టెంట్ల అధ్యక్షుడు కె.శ్రీరామ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఫీల్డు అసిస్టెంట్ యూనియన్‌కు చెందిన నేతలు అగస్టీన్, సురేంద్ర, భగవాన్, గణేష్, అచ్చిబాబు, శ్రీరామ్, ఎం.శ్రీనివాస్, ఎం.రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఫీల్డుఅసిస్టెంట్లకు మండల స్థాయిలో బదిలీలు జరిగే సౌకర్యం కల్పించాలని, ఫీల్డుఅసిస్టెంట్ మృతిచెందితే కుటుంబానికి రూ.10లక్షలు గ్రాడ్యుటీ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేయాలని, అర్హత, అనుభవాలను బట్టి ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ సమావేశం తీర్మానాలు చేసిందని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు.

రాజోలు నియోజకవర్గాన్ని ఆదుకోండి

మలికిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. శనివారం అమలాపురంలో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.రాజోలు నియోజకవర్గంలో మొంథా తుఫాన్ నష్టాన్ని ప్రభావాన్ని తగ్గించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు విశేష కృషి చేశారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో వరి పంట దెబ్బతిందని, రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో లక్ష కొబ్బరి చెట్లకు రూ.వెయ్యి చొప్పున పరిహారం అందజేసి కొత్త చెట్లను పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. విద్యుత్ రంగంలో 2వేల స్తంభాలు వంద కిలోమీటర్ల మేర కండక్టర్లు, కేబుల్ వైర్లు, 200 ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేసి జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని కోరారు. శంకరగుప్తంలో 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరారు. స్టేట్ హైవే 4.5కిలోమీటర్లు చింతలపల్లి నుంచి గుడిమెళ్లంక వంతెన వరకు రూ.11కోట్లతో ఎన్‌డీబీ పథకం కింద మంజూరైనా ఐదేళ్లుగా పనులు ప్రారంభం కాలేదని, వీటిని రద్దుచేసి ఎంజీఆర్ పథకం కింద త్వరలో పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే దేవ కోరారు.

నదీతీర ప్రాంత రివిట్‌మెంట్‌కు ఎమ్మెల్యే వినతి

పి.గన్నవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజవర్గంలో నాలుగు మండలాలకు మూడు మండలాలు గోదావరి తీర ప్రాంతంలోనే ఉన్నాయని అమలాపురం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తీసుకువెళ్లారు. ప్రతి ఏడాది వచ్చే వరదలు, తుఫాన్లు కారణంగా విలువైన వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని వివరించారు. దీంతో సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోత నివారణకు రివిట్‌మెంట్‌ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రధాన పంటలకు సాగునీరు అందించే కాల్వలకు ఉన్న లాకులు బ్రిటీష కాలం నాటివని, ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని ఎమ్మెల్యే వివరించారు. వాటి వల్ల సాగునీరుకు ఏవిధమైన ఉపయోగం లేదని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీరుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో 75శాతం వరకు పంటలకు నష్టం జరిగినట్లు వివరించారు. జరిగిన పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో రైతు లకు అందే విధంగా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడుని ఎమ్మెల్యే కోరారు. నరేంద్రపురం పీహెచ్‌సీ ఏర్పాటు, మానేపల్లి, పాశర్లపూడిలలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫైర్‌స్టేషన్ తదితర అం శాలను మంత్రిని కలిసి ఎమ్మెల్యే వివరించారు.

అద్వానీ జన్మదిన వేడుకలు

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజోలులో మాజీ ఉపప్రధాని ఎల్‌కే అద్వానీ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చెల్లింగి త్రినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడారు. కార్యక్రమంలో అడబాల రాంబాబు, దేవళ్ల మాణిక్యాలరావు, గంటి చంద్రశేఖర్, వడ్లమూడి ప్రకాష్, యింటిపల్లి రామకృష్ణ, కడలి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామయ్యకు ఆచార్య దేవోభవ పురస్కారం

మామిడికుదురు,నవంబరు8(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి ఎలిమెంటరీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు నయినాల రఘురామయ్య ఆచార్యదేవోభవ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ వారు ఈపురస్కారాన్ని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అందజేశారు. సేవా సంస్థ సేవలను మంత్రి అభినందించారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం కె. ఏనుగుపల్లి గ్రామానికి చెందిన పెనుమాల మంగాయమ్మ W/o భీమారావు గారికి సంబంధించిన పాస్‌పోర్ట్ నెం.G 0178873 గల ఒరిజినల్ పాస్‌పోర్టును జిరాక్స్ తీసుకునేందుకు కె.ఏనుగుపల్లి నుండి పి.గన్నవరం సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

పెనుమాల మంగాయమ్మ
డోర్.నెం.2-185, కె.ఏనుగుపల్లి, పి.గన్నవరం మండలం. సెల్: 9553690311





కుషాల్‌కు మంత్రి అభినందన




అమలాపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మూడో తరగతి చదువుతున్న కాట్రేనికోనకు చెందిన విత్తనాల కుశాల్‌నాగవెంకట్ కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూలులో 3వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో 195దేశాల పేర్లు, వాటి రాజధానుల వివరాలను రెండు నిమిషాల 59 సెకన్ల 11మిల్లీసెకన్ల కాల వ్యవధిలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో కుశాల్ చోటు దక్కించుకున్నాడు. శనివారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి కుశాల్‌తో పాటు తల్లి దివ్యను మంత్రి అభినందించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో సాధించిన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ నంద్యాల మనువిహార్ పాల్గొన్నారు

కరాటేలో స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటి స్వర్ణ పతకాలు సాధించారు. ఇన్విటేషనల్ ఓపెన్ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్-2025 పేరిట పవర్స్ షోటోకాన్ స్పోర్ట్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. సహస్ర స్కూలుకు చెందిన విద్యార్థులు బసవా మోక్షిత్‌సింహ, దొంగ లక్ష్మీదేవి, లింగోలు జయదీప్‌వీరేన్, దార్లంక పునీత్‌లు ఆయా విభాగాల్లో పతకాలు సాధించారు. వీరిని స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జార్జిపీటర్, బి.కేశవరావు, హెచ్‌ఎం జి.రాజా, కరస్పాండెంట్ ఆర్.సత్యకుమార్, పీఈటీ పావని, కరాటే శిక్షకుడు శీలం వెంకట్రావు పాల్గొని అభినందించారు. అదేవిధంగా బ్లూస్టార్స్ షోటోకాన్ కరాటేడూ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో అదే పాఠశాలకు చెందిన ఎస్.తన్విక్‌శ్రీవల్లీ, ఎస్.సాయికార్తికేయ స్వర్ణ పతకాలు సాధించగా వారిని అభినందించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆకెళ్ల



అమలాపురంరూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇందుపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఆకెళ్ల నారాయణమూర్తి శనివారం విజయవాడలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలి సమావేశంలో పాల్గొన్నారు. కూటమి నాయకులతో పాటు ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు నారాయణమూర్తిని అభినందించారు.

నేడు శ్రీమాణిక్యాంబ సహిత భీమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ఉప్పలగుప్తం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబ సహిత భీమేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన జరుగుతుందని ఆలయ కమిటీ ప్రకటించింది. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, అనంతరం లక్ష బిల్వార్చన ఉంటుందన్నారు. ఆలయ అర్చకుడు భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం (నాని), కార్తికేయశర్మ పర్యవేక్షణలో పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గౌరీశంకర్ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కుంకుమ పూజల్లో పాల్గొనే మహిళలకు సలాది గంగరాజు, సత్తిబాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అల్పాహారం, సాయంత్రం కొప్పిశెట్టి శ్రీనివాసరావు ధన సహాయంతో అన్న సమారాధన జరుగుతుందని కమిటీ ప్రకటించింది.

న్యాయవాదుల కార్తీక వనసమారాధన

అంబాజీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం కోర్టు కేసులతో బిజీబిజీగా ఉండే న్యాయవాదులు ఉపసమనం పొందేందుకు కార్తీక వనసమారాధనలు దోహదపడతాయని అమలాపురం కోర్టుస్పెషల్ మేజిస్ట్రేట్ పులిదిండి ప్రసాదరావు అన్నారు. గంగలకుర్రులోని కోనసీమ బృందావన రిసార్ట్స్‌లో అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో న్యాయవాదులు ఉత్సాహంగా గడిపారు. న్యాయవాదులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం న్యాయవాదులు కార్తీక వనసమారాధన భోజనాలు చేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు యాలంగి సత్యనారాయణ, కార్యదర్శి దొమ్మేటి వెంకటేశ్వరరావు, కోశాధికారి నందెపు చిన్న, సభ్యులు అడపా ప్రసాద్, మహ్మద్ ఆజాం, కుడుపూడి అశోక్, పి.సత్యనారాయణ, కూచిమంచి శశిధర్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

అంబాజీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు సెంటర్లో ఏర్పాటు చేసిన 27అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రముఖులు, గ్రామస్తులు దర్శించుకున్నారు.

బాలబాలాజీ దర్శనానికి పాదయాత్రగా భక్తులు

పి.గన్నవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి దర్శనానికి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 800మంది భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. వీరికి చాకలిపాలెంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, స్థానిక నాయకులు స్వాగతం పలికి శీతలపానియాలు అందించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు, భీమలాపురం గ్రామాల భక్తులు దొడ్డిపట్ల రేవుదాటి చాకలిపాలెం, జగ్గన్నపేట మీదుగా చిన్నారుల కోలాటాలు, భక్తిపాటలతో పాదయాత్రగా అప్పనపల్లి స్వామివారి దర్శనానికి వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు త్రిమూర్తులు, ఆరుమిల్లి రాంబాబు, వేమన మల్లేశ్వరరావు, మేడిద సాయిబాబు, వేమన గంగాధరం ఉన్నారు.

19న విద్యార్థులకు పోటీలు

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్‌బీఎన్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల19న విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు జీఎస్‌బీఎన్ రెడ్డి ట్రస్టు ఫౌండర్, చైర్మన్ గిడ్డి ప్రభాకర్ తెలిపారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 19వతేదీ ఉదయం తెలుగు, ఇంగ్లీషు విభాగాల్లో వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్స్ విభాగానికి సంబంధించి 6,7తరగతులకు క్రీడలు, శారీరక ధృడత్వం ప్రాధాన్యం అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. సీనియర్స్ విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అంశంపై వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. 6,7తరగతుల జూనియర్స్ విభాగానికి సంబంధించి ఉచ్ఛరణ కర్త తెలుగు పదాలు చెబుతుంటే ఆ పదం స్పెల్లింగులను రాయాల్సి ఉంటుందన్నారు. సీనియర్స్ విభాగంలో 8, 9,10తరగతులకు ఇదే అంశంపై పోటీలు నిర్వహిస్తారు. ఈనెల25న విజేతలకు బహుమతులు అందిస్తారు.

రేపు ఐటీఐలో పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళా

యానాం,నవంబరు8(ఆంధ్రజ్యోతి): యానాంనేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలోని అప్రెంటిస్ సెల్ ఆధ్వర్యంలో పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళాను సోమవారం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ తెలిపారు. ఈమేళాలో యానాం, పరిసర ప్రాంతాల నుంచి అన్ని ట్రేడ్లకు చెందిన ప్రస్తుతం, గతంలో చదివిన ఐటీఐ శిక్షణార్థులు పాల్గొని వివిధ పరిశ్రమల సంస్థలో అప్రెంటీస్ ట్రైనింగ్ కోసం నమోదు చేసుకోవచ్చన్నారు.



లొల్లలాకుల వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టాకు సాగునీరు అందించే లొల్ల లాకుల వద్ద తరచూ ట్రాఫిక్ కష్టాలు ఏర్పడుతున్నాయి. శనివారం వస్తే చాలు విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొబ్బర్లంక నుంచి వాడపల్లి, వాడపల్లి నుంచి బొబ్బర్లంక మీదుగా వివిధ ప్రాంతాలకు ఆటోలు, కార్లు, బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాకుల వ్యవస్థ శిథిలస్థితికి చేరుకుంది. లాకుల మీదుగా ఒక వాహనం నుంచి మరో వాహనం తప్పించుకుని వెళ్లే మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు, ప్రయాణికులు నిర్ణీత సమయానికి చేరుకోలేకపోతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాకుల వ్యవస్థ ఆధునికీకరించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలు ఉండవని వ్యాఖ్యానిస్తున్నారు. అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయిన వాహనదారులు


మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

'తూర్పు'లో కలిపిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుంది

మండపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరిలో కలిపేలా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అన్నారు. మండపేటను తూర్పులో కలుపుతూ మంత్రి వర్గ సబ్ కమిటీ ఆమోదించిన నేపథ్యంలో ఎమ్మెల్యేను శనివారం మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు వైసీపీ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి తదితరులు కలిసి అభినందించారు. తూర్పు గోదావరి జిల్లాలో మండపేటను కలపాలని పోరాడిన ప్రజా సంఘాలు, ప్రజలు, విద్యార్థి సంఘాలను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజల ఆకాంక్ష మేరకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్వరలో మండపేట తూర్పు గోదావరిలో కలుస్తుందని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణతోపాటు మంత్రివర్గ సంఘానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్లతో పాటు పలువురు స్థానిక నాయకులు తదితరులు వున్నారు.

28న ఏపీఎన్జీవో అసోసియేషన్ ఎన్నిక

కపిలేశ్వరపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో అసోసియేషన్ మండపేట తాలూకా యూనిట్ ఎన్నికల అధికారులను ప్రకటించినట్టు ప్రస్తుత ఏడీహెచ్‌వోసి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాదవరపు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవోస్ మండపేట యూనిట్ ప్రెసిడెంట్ జె. మల్లికార్జునుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా రామచంద్రపురం యూనిట్ అధ్యక్షులు సీహెచ్ సూర్యారావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎంకెవీ రావు, ట్రెజరర్, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా జి.వెంకటేశ్వరరావులను నియమించినట్లు చెప్పారు. కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం ఎన్జీవో సంఘం సభ్యులు మాత్రమే ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఓటర్ల నమోదు ఆఖరు తేదీ ఈనెల 13 సాయంత్రం 5 గంటల వరకు, నామినేషన్ తేదీ 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, ఎలక్షన్ తేదీ 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతందన్నారు. యూనిట్ కాలపరిమితి ముగిసిన సందర్భంగా పూర్తి వివరాలను మండపేట మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచినట్లు వారు తెలిపారు.


ఉద్యోగ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులు

ఉద్యోగ మేళాలో 12 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలలో 12 మంది ఎంపికయ్యారు. రేడియంట్ అప్లయన్స్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ 2, ప్రీమియర్ ఎనర్జీస్ 1, రినేవ్‌సిస్ ఇండియన్ 4, మైక్రోమ్యాక్స్ 2, ఫోక్సాన్ 3 మంది ఎంపికైనట్లు ఉపాధి కార్యాలయం డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేస్తారని ఆయన తెలిపారు.

చేనేత కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ


చేనేత కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తున్న వీరభద్రరావు, సతీష్ తదితరులు

ద్రాక్షారామ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఎన్. సత్తిబాబు, చేనేత కార్మికుల నాయకులు దొంతంశెట్టి సత్యప్రకాష్, చోడిశెట్టి వీరభద్రరావు, బొల్లం సత్తిరాజు, వార్డు సభ్యులు చింతపల్లి రాంబాబు, చోడిశెట్టి పాండురంగారావు, బట్ట శ్రీను, గోరు బాబి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 162 మందికి నేత్ర పరీక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో మోడరన్ ఏబీసీ పాఠశాలలో శనివారం మోడరన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 162 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 162 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా 15 మందికి శస్త్ర చికిత్సలు గుర్తించారు. పది మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందచేయడానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హరిత, పాపారావు, మోడరన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో జి.మాణిక్యం, ఎ.శ్రీనివాస్, ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.


నేత్రపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సత్తెమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

మండపేట, నవంబరు, 8(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం ద్వారపూడిలోనున్న శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించామని ఆలయ ట్రస్టీ మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి చెప్పారు. గ్రామంలోని కొండపల్లి వీధిలో వున్న అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల భక్తులు, ప్రజలు ఈ అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.



నిధులు మంజూరైనా ఇక్కట్లే

• రోడ్డు మరమ్మతులకు రూ.2.25 కోట్లు మంజూరు • కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రయాణికులకు తప్పని పాట్లు

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిధులు లేక రోడ్డు నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఒక ఎత్తయితే, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా దాన్ని చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం మరో ఎత్తు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పని దుస్థితి నెలకొంది. ఇదెక్కడో కాదు. జొన్నాడ-మండపేట రోడ్డుకు ఈ దుస్థితి పట్టింది. ఇటీవల జొన్నాడ-మండపేట రోడ్డు దుస్థితిపై ఉన్నతాధికారులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివరించడంతో వీటి మరమ్మతులకు రూ.2.25 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. గత నెలలో టెండర్లు పిలిచి మరమ్మతు చేయడానికి కాంట్రాక్ట్ ఒప్పందం కూడా జరిగింది. మరమ్మతు చేయడానికి కాంట్రాక్టర్ తీవ్ర జాప్యం చేయడంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు మరింత పెరిగి ప్రయాణికులకు ఇబ్బందిగా మరింది. నిధులు మంజూరు అయినప్పటికీ పనులు చేపట్టకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితిని అధికారులు గుర్తించి తక్షణం మరమ్మతు చేపట్టడానికి కాంట్రాక్టర్‌పై వత్తిడి తీసుకురావాలని స్థానిక కూటమి నాయకులు, స్థానికులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న జొన్నాడ-మండపేట రోడ్డు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సూర్యనారాయణ, డీఈ ఆర్‌అండ్‌బీ, రామచంద్రాపురం

జొన్నాడ-మండపేట రోడ్డుకు మంజూరైన నిదులతో రిపేర్లు పనులు నాలుగు రోజుల వ్యవధిలో పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బి డిప్యూటీ ఇంజనీరు సూర్యనారాయణ తెలిపారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలు పూర్తి చేయడం జరిగిందని ఈనెల 15లోపునే పనులు ప్రారంభించి త్వరితగతిని పూర్తి చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

వీఎస్ఎంలో టెక్స్‌ఫో 2కె25

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వీఎస్ఎం కళాశాలలో టెక్స్‌ఫో 2కె25 కార్యక్రమం జరిగింది. వీఎస్ఎం ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు 200 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు దీన్ని సందర్శించారు.


ద్వారపూడిలో పూసిన బ్రహ్మకమలం

విరబూసిన బ్రహ్మకమలం

మండపేట, నవంబరు, 8(ఆంధ్రజ్యోతి): ద్వారపూడికి చెందిన ఉలవకాయల వేంకటేశ్వరరావు ఇంట్లోని బ్రహ్మకమలం పువ్వు శనివారం తెల్లవారుజామున వికసించింది. తమ ఇంట్లోని ఈ పువ్వు పూయడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్రస్థాయి వృత్తి నైపుణ్య పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వృత్తినైపుణ్య పోటీలకు బొబ్బా జయశ్రీ జడ్పీ గరల్స్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో అమలాపురంలో జరిగిన పోటీల్లో ఆలమూరు విద్యార్థినులు టి.గ్లోరీ, ఎం.లక్షితా రెడ్డి, యు.మణి బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగంలో ప్రథమస్థాయి విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా పోటీలలో విజేతలుగా నిలిచిన వీరికి జిల్లా విద్యా శాఖాధికారి సలీంబాషాతోపాటు పలువురు అధికారుల నుంచి బహుమతులు పొందారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ఎం. లక్ష్మిని శనివారం హైస్కూల్ ఆవరణలో స్కూల్ హెచ్‌ఎం కె.ఉమ, ఉపాధ్యాయులు కామవరపు మల్లికార్జునరావుతోపాలు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.


ముమ్మిడివరప్పాడు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు

కార్తీక మాస పూజలు

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా శివాలయాల్లో కార్తీక మాస పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు, నీరాజన మంత్రపుష్పం, అష్టోత్తర సహస్ర నామ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చేయూత సంస్థ ద్వారా ముగ్గురికి అవార్డులు

కె.గంగవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న వారికి, ఉత్తమ బోధనలకు మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. కె.గంగవరం మండల జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిర్రా రాజ్‌కుమార్ చేసిన పలు సేవలకు జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఉత్తమ బోధనలకు మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు అద్దంకి లక్ష్మీ సౌభాగ్య, జిళ్లెళ్ల ప్రేమ్‌కుమార్‌లను ఆచార్య దేవోభవ పురస్కారానికి ఎంపిక చేశారు. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో వీరికి కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ సమక్షంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వీరిని కె.గంగవరం సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, పలువురు కూటమి నాయకులు తదితరులు అభినందించారు.

డివిజన్ కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి

కొత్తపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో ముఖ్యమైన కార్యాలయాల నిర్మాణాలకు కొత్తపేట మార్కెట్ యార్డు స్థలాన్ని మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. శనివారం జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ సమయంలో అధికారులు విశేషంగా కృషి చేశారన్నారు. తుఫాన్ సమాచారం అందినప్పటి నుంచే అధికారులు అప్రమత్తంగా ఉండి తీర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై పలు సూచలు చేశారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భద్రతా సిబ్బందిని పెంచాలని ఆయన సూచించారు. ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం తగిన భూమిని కేటాయించాలని ఆయన కోరారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జొన్నాడలోనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తులసి దాత్రి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించి అనంతరం తులసి మొక్కకు తులసి దాత్రి పూజను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గొడవర్తి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో దాత సహకారంతో ఆలయ ప్రాంగణంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు.

ఆలమూరులో.. కార్తీకమాసం శనివారం సందర్భంగా ఆలమూరులోని శ్రీదేవి భూదేవి సమేత నవజనార్దనస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.


జొన్నాడలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

కపిలేశ్వరపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో నున్న అగస్త్యేశ్వర, పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని వై.కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం లక్ష్మీగణపతి హోమాన్ని వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వాముల పేటతుల్లి

కపిలేశ్వరపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగరలో అయ్యప్పస్వాముల పేటతుల్లి కార్యక్రమాన్ని శనివారం వైభవంగా జరిపారు. గురుస్వామి బవిరిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అయ్యప్పస్వామిని ఉంచి వీధుల్లో ఊరేగించారు. అంగర, పడమరఖండ్రిక గ్రామాల అయ్యప్ప మాలదారులు పలువురు భక్తిపారవస్యంతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


అంగరలో పేటతుల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

వరికోతలు ప్రారంభం

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నేలకొరిగి ముంపు బారిన పడిన పంట పొలాల్లో నీరు తగ్గడంతో రైతులు వరికోతలు ప్రారంభించారు. మండలంలోని ఈతకోటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు వరికోతలు ప్రారంభించారు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ట్రాక్టర్ల సాయంతో కల్లాలోకి తరలిస్తున్నారు.


ఈతకోటలో ట్రాక్టర్‌పై ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

చిన్నారులకు స్కాలర్‌షిప్పులు అందజేత

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ర్యాలికి చెందిన ఇంద్రజాలికుడు డాక్టర్ శ్యామ్ జాదుగర్ తన తండ్రి వీరమణి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలి పరిసర ప్రాంతంలో పేద చిన్నారులకు పది మందికి రూ.1500 చొప్పున ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు అందించారు. వృద్ధులకు మందులు, పండ్లు పంపిణీ చేశారు. చిరువ్యాపారులకు గొడుగులు, వంద మంది వలసకూలీలకు భోజన పొట్లాలు అందించారు. కార్యక్రమంలో సూర్యచంద్రరావు, మోహిత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలిలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండపేటలో రేడియాలజీ డే

మండపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండపేట పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రేడియాలజీ డేను నిర్వహించారు. పట్టణానికి చెందిన రేడియాలజిస్టు డాక్టర్ కె.శ్రీధర్‌ను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈసందర్భంగా 60 సంవత్సరాలు పీఎంపీ అసోసియేషన్ సావనీర్‌ను డాక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోనా సత్యనారాయణ, సంఘ నాయకులు పీఎంపీలు బళ్ల వెంకటరమణ, వానపల్లి కనకరాజు, మండిపూడి చంద్రశేఖర్, పి.సతీష్, శివ, శ్రీను, పుచ్చల కాశీ, గాలింకి నాగేశ్వరరావు త్రిమూర్తులు అచ్చియ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ రేడియాలజీ డేను నిర్వహిస్తున్న దృశ్యం


శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1.79 లక్షలు

కొత్తపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తజనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,79,760 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో డి.సురేష్ బాబు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో మహాగణపతి

ఘనంగా సంకట చతుర్దశి

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోనున్న మహాగణపతికి సంకటచతుర్థశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చనలను నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మాలధరించిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో భక్తులు పాల్గొన్నారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.


మడికి శివాలయంలో లక్షపత్రి పూజ జరిపిన దృశ్యం

మడికి శివాలయంలో లక్షపత్రి, లక్షబిల్వార్చన

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మడికి సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి లక్షపత్రి, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. అర్చకులు కాళ్లకూరి కామేశ్వరశర్మ, అయ్యలూరి బ్రహ్మన్నల ఆధ్వర్యంలో పలువురు పండితులు లక్షపత్రి, లక్షబిల్వార్చనలతోపాటు అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపించారు. వీటిని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.


దంత వైద్యంపై అవగాహన కల్పిస్తున్న అపెక్స్ వైద్యులు

దంతాల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రావులపాలెం చైతన్య స్కూల్‌లో అపెక్స్ సూపర్ స్పెషాల్టీ హాస్పటల్ ఆధ్వర్యంలో దంత ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. దంతాల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదని విద్యార్థులకు సూచించారు. ప్రొఫెసర్ దంత వైద్య నిపుణులు పోలిశెట్టి రేవతి అపర్ణ మాట్లాడుతూ దంతాల సంరక్షణలో అజాగ్రత్త తగదన్నారు. ప్రతిరోజూ రెండుసార్లు దంతాలు పరిశుభ్రపరుచుకోవాలన్నారు. అవగాహన సదస్సులో చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవడంలో విఫలం'

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయం పేరును విజన్ యూనిట్‌గా మార్చడం కాదని సబబు కాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నెల 12న జరగబోయే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.